ప్రచురణార్థం/ ప్రసారార్థం :

# ఐక్య ఉద్యమాలతో బిజెపిని సాగనంపాలి
# అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలి
# హిందుత్వ కార్పొరేట్ కూటమి లక్ష్యంగా మోదీ
# సిపిఎం, సిపిఐ నేతలు కరత్, బినయ్
# ప్రారంభమైన ప్రచారభేరి

దేశంలోని లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష శక్తులన్ని కలిస్తేనే 2024 ఎన్నికల్లో బీజేపీని సాగనంపగలుగుతామని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్, సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు బినయ్ విశ్వం అన్నారు. ఐక్య ఉద్యమాలే శరణ్యమని, రాజకీయ పక్షాలు ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా ఏకం కావాల్సిన అవసరముందని తెలిపారు. హిందూత్వ కార్పొరేట్ కూటమికి మోదీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంటూ దేశంలో బడా పారిశ్రామిక రాజ్యాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందని, దీనికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల ఐక్య ఉద్యమాలు తీసుకురావాలని తెలిపారు. ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీమోదీని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో సిపిఐసిపిఎం చేపట్టిన ప్రచారభేరిని శుక్రవారం ప్రారంభించారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంతకుముందు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి నివాళలర్పించారు. అనంతరం ర్యాలీగా ఏలూరు రోడ్డు, మ్యూజియం రోడ్డు మీదగా ఎంబి విజ్ఞాన కేంద్రానికి ర్యాలీగా వెళ్లారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ముందుగా ప్రకాష్ కరత్ మాట్లాడారు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ దేశ రాజ్యాంగం ఏర్పాటులో బిఆర్ అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని, ఆయన సారధ్యంలో లౌకిక ప్రజాతంత్ర రాజ్యాంగంగా ఏర్పడిందన్నారు. దేశాన్ని మనుస్మృతి ఆధారంగా హిందూ రాష్ట్రంగా మార్చాలనే సిద్ధాంతాన్ని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంపై ప్రమాణ స్వీకారం చేసిన మోడీ, మంత్రులు ఆ రాజ్యాంగాన్నే వమ్ముచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర పోరాటంలో ముస్లింలు ఉన్నారనే కారణంతో ఆర్ఎస్ఎ పాల్గనలేదని, పైగా ముస్లింలకు వ్యతిరేకంగా పోరాటం చేసిందన్నారు. స్వాతంత్రం వచ్చిన తరువాత కూడా భారత రాజ్యాంగం లౌకిక, ప్రజాస్వామ్య పద్ధతిలో ఉండకూదని వ్యతిరేకించిందని వివరించారు. భారతదేశం హిందూ రాష్ట్రంగా మారడం అంటే దేశ వినాశనమే అని అంబేద్కర్ చెప్పారని గుర్తుచేశారు. అటువంటి అంబేద్కర్‌ను తమ సొంతం చేసుకోవాలని ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగంలోని లౌకికతత్వాన్ని నాశనం చేసి, హిందూత్వ సిద్ధాంతాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. బిజెపి అధికారంలో ఉన్న గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో లౌకిక చట్టాలు తొలగించి హిందూత్వ చట్టాలు తీసుకొచ్చారని మండిపడ్డారు. లవ్ జీహాద్, గో రక్షక చట్టాలు పేరుతో బాధితులపై దాడులు చేస్తున్నారని తెలిపారు. హిందూత్వ విధానాల మద్దతు కోసం హిందూత్వ కార్పొరేట్ కూటమి లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజల సమస్యలు లేవనెత్తుతున్న ప్రతిపక్షల గొంతును పార్లమెంటులో నొక్కుతుందని, ఈడి, సిబిఐ, ఐటీ వంటి సంస్థలను ప్రతిపక్షాలపై ఊసిగొల్పి దాడులు చేస్తోందని మండిపడ్డారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో కొద్దిమంది పెట్టుబడిదారులే మాత్రమే పెద్దమొత్తంలో ఆస్తులు సంపాదించారని తెలిపారు. దేశంలోని ఎయిర్‌పోర్టులు, పోర్టులు, విద్యుత్ ప్లాంట్లు అదానీకి అప్పగించడంతో అతని ఆస్తులు పెరిగాయని తెలిపారు. ప్రస్తుతం కొద్దిమంది వద్దే సంపదంతా పొగుపడుతుందని, ఇది దేశంలో అసమానతలను తగ్గించాలనే రాజ్యాంగ మౌలిక సూత్రానికి విరుద్ధమన్నారు. హిందూత్వ విధానాలు అమలు పరుస్తున్న మోడీకి కార్పొరేట్ శక్తులు మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. మోడీ ఆర్థిక విధానాల వల్ల దేశంలోని సామాన్య ప్రజలపై విపరీతమైన భారాలు పడుతున్నాయని చెప్పారు. కార్పొరేట్లపై పన్నులు మోపకుండా ప్రజలపై పన్నులు, భారాలు మోపుతున్నారని విమర్శించారు. సంపదంతా ఒక చోట పొగుపడటంతో చిన్న కంపెనీలు మూతపడుతున్నాయని, దీనివల్ల నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. వ్యవసాయంలో బడా కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నం చేస్తోందన్నారు. నిరుద్యోగం పెరుగుదుల, వ్యవసాయ సంక్షోభం, ప్రజలపై భారాలు పెరగడానికి కారణం మోడీ ఆర్థిక విధానాలు అని విమర్శించారు. మోడీ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాలు తీవ్ర పోరాటాలు చేస్తున్నాయని తెలిపారు. లౌకిక ప్రజాతంత్ర శక్తులు కలిసి మోడీకి వ్యతిరేకంగా పోరాడి ఎదిరిస్తేనే విజయం సాధించగలమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్యపోరాటాలు చేయడం వల్లే ప్రైవేటీకరణను వాయిదా వేస్తున్నట్లు కేంద్రం ప్రకటించిందన్నారు. దేశంలో బిజెపికి వ్యతిరేకంగా

ఉండే లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఏకం చేయాలని, అటువంటి ప్రయత్నం జరగాలని కోరారు. దక్షిణాదిలో కర్ణాటక రాష్ట్రంలోనే బిజెపి అధికారంలో ఉందన్నారు. కేంద్రం నిరంకుశ విధానాలు, రాష్ట్రాల హక్కులు హరించే విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు పోరాడుతున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో భిన్నమైన పరిస్థితి ఉందని, జగన్ ప్రభుత్వం కేంద్రాన్ని పల్లెత్తు మాట అనడం లేదనాన్నరు. పైగా బిజెపి అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను రాష్ట్రంలో తూచ తప్పకుండా పాటిస్తోందన్నారు. బిజెపిని వ్యతిరేకించే క్రమంలో జగన్ విధానాలను కూడా ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బిజెపి ఆర్థిక, హిందూత్వ, హిందూత్వాకార్పొరేటీకరణ విధానాలను ఎండగట్టేలా మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లాలని కోరారు. ఈ పోరాటం బిజెపి, ఆర్ఎస్ఎస్ విధానాలను రానున్న కాలంలో వెనక్కు నెడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. బినయ్ విశ్వం మాట్లాడుతూ విజయవాడ అంటే కమ్యూనిస్టు అగ్రనేతలు చంద్ర రాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్య, పుచ్చలపల్లి సుందరయ్య నేతృత్వం వహించిన ఉద్యమాలు, తెలంగాణ పోరాటాలు గుర్తు వస్తాయని తెలిపారు. దేశంలో మోదీ అనుసరిస్తున్న హిందుత్వ సిద్ధాంతానికి భిన్నమైన సిద్ధాంతం కమ్యూనిస్టుల దగ్గర ఉందన్నారు. వామపక్షాలు మార్క్సిజం సిద్ధాంతాన్ని అవలోకనం చేసుకుని, ప్రపంచాన్ని అర్థం చేసుకున్న పరిస్థితి మనకు ఉందని, ఈ సిద్ధాంతాలను కొందరు వెక్కిరించడాన్ని తప్పుపట్టారు. కార్ల్‌మార్క్స్ చెప్పినట్లుగా పెట్టుబడి అందర్నీ తన బానిసలుగా చేస్తుందని, ఇది విస్తరిస్తున్న కొద్దీ ఎవరైనా దానికి బానిసగా మారాల్సిందేనని తెలిపారు. నేడు మోదీ ప్రభుత్వ విధానంలో అవే విధానాలను చూస్తున్నామన్నారు. ప్రధాని మోడీ అదాని అనే పెట్టుబడిదారులకు బానిసలుగా మారిపోయారంటూ విమర్శించారు. ఫాశిస్టు సిద్ధాంతంతో దేశాన్ని పరిపాలించేందుకు మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అంబేద్కర్ గురించి మాట్లాడుతున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ ఆయన చెప్పిన సిద్ధాంతాల్ని అనుసరించడం లేదని విమర్శించారు. హిందూ రాజ్యం అనేదీ దేశ విధానం కాదంటూ అంబేద్కర్ చెబితే దానికి విరుద్ధంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఆరెస్సెస్, బిజెపికి సొంత సిద్ధాంతం లేదని, ఇది భారత దేశ ఫాశిస్టు సిద్ధాంతంగా చెప్పవచ్చని అన్నారు. ఫాశిస్టు సిద్ధాంతాలను ఛాలెంజ్ చేసే శక్తి ఒక కమ్యూనిస్టు సిద్ధాంతాలకే ఉందంటూ పునరుద్ఘాటించారు. అవినీతి మచ్చలేని వారు కమ్యూనిస్టులున్నారని, వారికి ఈడీ, ఐటీ, సీబీఐ అంటే ఎలాంటి భయం ఉండబోదని స్పష్టం చేశారు. సిపిఐ, సిపిఎం ఎన్నికల కమిషన్ ఇచ్చే సర్టిఫికెట్లతో పనిచేయడం లేదని, ప్రజాపోరాటాలతో ప్రజలిచ్చిన సర్టిఫికెట్లతో ఈ పార్టీలు కొనసాగుతున్నాయని నొక్కిచెప్పారు. కమ్యూనిస్టుల ఐక్యత అత్యవసరమని, ఈ ఐక్యత ముందు ప్రతి అంశంలోనూ ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాలు కలసి పనిచేయాల్సిన అవసరముందని సూచించారు.రెండు పార్టీల ఉమ్మడి పోరాటాలు అత్యవసరమని పునరుద్ఘాటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక వైపున అంబేద్కర్‌కు భారీ ఎత్తున విగ్రహాలు కట్టి, పెద్దఎత్తున ప్రభుత్వాలు ఉత్సవాల్ని నిర్వహిస్తూ, మరోవైపు దళిత, ఆదివాసీ, బీసీలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులను విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. మోడీ అధికారంలోకి వచ్చాక కేంద్ర బడ్జెట్‌లో ఉండే ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ తొలగించారని, రిజర్వేషన్లు సరిగ్గా అమలు చేయడం లేదని, మనువాదం పేరుతో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ సంరక్షణ చట్టాలకు సవరణ చట్టాలు తెచ్చి, అక్కడి భూములను పెత్తందారులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై కేంద్రం ద్రోహం చేస్తుంటే సీఎం జగన్ మౌనంగా ఉండటం తగదన్నారు.సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాలను గద్దె దించాలంటే దేశంలోని కమ్యూనిస్టులతోపాటు ప్రతిపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఐక్యం కావాలని కోరారు. దేశంలో ఏ రాష్ట్రానికి చేయనంత అన్యాయాన్ని ఏపీకి మోడీ ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా పదేళ్లు ఇస్తామని చెప్పి, నేడు ముగిసిన అధ్యాయంగా మాట్లాడటాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. విభజన హామీలు అమలు చేయలేదన్నారు. దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న పరిపాలనపై పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధమవ్వాలని కోరారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ బిడ్‌లో తెలంగాణ ప్రభుత్వం బిడ్ వేయడం జగన్‌కు రాజకీయ ఆత్మహత్యేనని ఎద్దేవా చేశారు. ఈ సభకు సిపిఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు పి మధు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె శ్రీదేవి, డివి కృష్ణ, దోనేపూడి కాశీనాథ్, కార్పొరేటర్ సత్తిబాబు, నాయకులు, ప్రవీణ్, కృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.దుర్గాభవాని, సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, నాయకులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

= = = =